రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త







# చిత్రం.. భళారే విచిత్రం..!

## బోరుబావి తొలగించకుండానే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు!

**నందిగామలో అధికారుల నిర్వాకం**

**వింత సమస్యకు సర్పంచ్ వినూత్న పరిష్కారం**

**మోటార్ బిగించి ఊరందరికీ నీటి వసతి**



ఇంట్లో ఉన్న బోరుబావికి మోటార్ బిగిస్తున్న సిబ్బంది

సాధారణంగా పొలాల్లోనో లేదా ఇంటి బయటో ఉండాల్సిన బోరుబావి, నందిగామ మండల కేంద్రంలోని ఒక డబుల్ బెడ్‌రూమ్ ఇంట్లో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో వ్యవసాయ భూమిగా ఉన్న ఆ స్థలంలో ఒక బోరుబావి ఉండగా, ఆ తర్వాత అధికారులు దానిపైనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టారు. ఇండ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా ఆ బోరుబావిని అలాగే వదిలేయడంతో, అది కాస్తా నడింట్లో నాలుగు గోడల మధ్యకు చేరింది. అయితే ఈ వింత పరిస్థితిని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, బొమ్మగళ్ళ నర్సింలు తదితరులు చక్కగా ఉపయోగించుకున్నారు. వృథాగా ఉన్న ఆ బోరుబావికి కొత్తగా మోటార్ బిగించి, నీటిని వినియోగంలోకి తీసుకువచ్చారు. తద్వారా స్థానిక ప్రజల నీటి కష్టాలను తీరుస్తూ వారు సేవలందిస్తున్నారు. ఇల్లు కట్టిన అధికారులు ఆ బోరు బావిని ఇంట్లోనే వదిలేసినప్పటికీ, దానిని ప్రజల అవసరాలకు వాడుకునేలా చేసిన సర్పంచ్, వార్డు సభ్యుల సమయస్ఫూర్తిని, ప్రజా సేవను స్థానికులు ఎంతగానో అభినందిస్తున్నారు.

- ప్రభాతవార్త, నందిగామ

# మల్కాజిగిరి ఓ మినీ భారత్

**మూడు కార్పొరేషన్లు చేసింది రాజకీయాల కోసం కాదు..**

**పరిపాలన సౌలభ్యం కోసమే!**

**గతంలో ఎంపిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధిచేయలేకపోయా**

**నేడు సిఎంగా న్యాయం చేస్తా**

**◆పార్టీలకతీతంగా కలిసిరండి ◆విపక్షాలకు సిఎం రేవంత్ పిలుపు ◆ఎలివేటెడ్ కారిడార్, మెట్రో విస్తరణకు హామీ ◆రూ. 1,474 కోట్ల పనులకు శంకుస్థాపన..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 7 ప్రభాతవార్త:** "గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉండి ఈ ప్రాంతాన్ని అనుకున్నంతగా అభివృద్ధి చేయలేకపోయాను. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రిగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తాను" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ భగాయత్ వేదికగా జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. అక్కడ రూ.98 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్కాజిగిరి నగర మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణంతో పాటు, మొత్తం సుమారు రూ. 1,474 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లను (జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) ఏర్పాటు చేయడం వెనుక ఎలాంటి రాజకీయం లేదని, కేవలం పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. నగర శివారు ప్రాంతాలను అన్ని రంగాల్లో సమానంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే.. శివారు మున్సిపాలిటీల్లోని గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లను విలీనం చేయడం జరిగిందని ఆయన వివరించారు. మల్కాజిగిరి ప్రాంతాన్ని 'మినీ భారతదేశం'గా సీఎం అభివర్ణించారు.





అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న సిఎం రేవంత్‌రెడ్డి, సభలో ఆనందోత్సాహాన్ని ప్రదర్శిస్తున్న అభిమానులు



నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఉప్పల్ నియోజకవర్గ నాయకులు

**మల్కాజిగిరికి వరాల జల్లు**

మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక హామీలను ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి శామీర్పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ రోడ్డుతో పాటు మెట్రో విస్తరణ పనులను చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు మల్కాజిగిరి పరిధిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టామని ప్రకటించారు.

**ఎన్నికల వరకే రాజకీయం చేద్దాం..**

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేసుకుందామని, ఇందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సీఎం కోరారు. 'ఎన్నికల ముందు మాత్రమే రాజకీయం చేద్దాం.. ప్రస్తుతం అభివృద్ధి పనులకు అందరూ కలిసిరావాలి' అని ప్రతిపక్ష పార్టీలకు ఆయన సూచించారు. ఈ అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, దామోదరం రాజనర్సింహ, ఉప్పల్ ఎమ్మెల్యే బి. లక్ష్మారెడ్డి, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా పాల్గొన్నారు. అలాగే డీసీసీ అధ్యక్షులు వజ్రేశ్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం. పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిలతో పాటు జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.



# నర్సరీకే రూ.2.51 లక్షలు

**ఏరియాల వారీగా ఫీజులుం**

**అడ్మిషన్లకు గేట్లు తెరిచిన కార్పొరేట్ విద్యాసంస్థలు**

**ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్**



(హైదరాబాద్-ప్రభాతవార్త)

గ్రేటర్‌లోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో నూతన ప్రవేశాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు విద్యాసంస్థలు అడ్మిషన్లకు తెరదీశాయి. రూ. లక్షల ఫీజులు డిమాండ్ చేస్తున్నాయి. గ్రేటర్ పరిధి హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లు దాదాపు 60 వరకు ఉన్నాయి. మిగతావి కార్పొరేట్, టెక్నో, బడ్జెట్ బదులుగా కొనసాగుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ఇంటర్నేషనల్, కార్పొరేట్ విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ స్కూల్ అడ్మిషన్, రెగ్యులర్ ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచి తల్లిదండ్రుల జేబులను గుల్ల చేస్తున్నాయి. నగరంలోని ఓ ప్రైమరీ స్కూల్‌లో నర్సకి రూ. 2.51 లక్షలు, ఫస్ట్, సెకండ్‌క్లాసులకు రూ.2.91 లక్షలు వసూలు చేస్తున్నారని ఓ మహిళ కొన్ని నెలల క్రితం తన ట్విట్టర్ ఖాతా (ఎక్స్)లో పోస్టు చేయడం చర్చనీయాంశమైంది. ఏబీసీడీలు నేర్చుకునేందుకు నెలకు రూ.21 వేలా అంటూ ఆమె వాపోయారు.

**ఫీజులను నియంత్రించాలి...**

2026-27 విద్యా సంవత్సరం ప్రారంభానికి వారం రోజుల సమయం ఉన్నప్పటికీ గ్రేటర్‌లోని పలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల యాజమాన్యాలు అక్రమార్జనకు తెరలేపాయి. తల్లిదండ్రుల ఆసక్తిని గమనించి అడ్మిషన్ల ఫీజును అడ్డగోలుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో భారీ ఫీజులకు వ్యతిరేకంగా ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టినా.. ప్రభుత్వం స్పందించకపోవడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే వారే కరువయ్యారని విద్యార్థి సంఘాల నాయకులు మండి పడుతున్నారు. అడ్మిషన్లకు రూ. లక్షల వసూళ్ల తో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు ఆయా విద్యాసంస్థల్లో చదువుకునే అవకాశం లేకుండా పోతోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఫీజులను నియంత్రించాలని కోరుతున్నారు.

**అనుమతులు లేకుండానే..**

నగరంలో నడుస్తున్న ప్రీస్కూళ్లలో 40 శాతం వరకు అనుమతిలేకుండానే నడిపిస్తున్నట్లు సమాచారం. కొంతమంది నిర్వాహకులు చిన్నపాటి ఇళ్లను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. పలు చోట్ల కేవలం రెండు, మూడు గదుల్లోనే పిల్లలకు ఆటబొమ్మలు, ఆట వస్తువులు ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు నడుపుతున్న పాఠశాల లకు భారీగానే ఫీజులు వసూలు చేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, ముషీరాబాద్,అంబర్‌పేట్, సికింద్రాబాద్, ఉప్పల్,బోడుప్పల్, నాంపల్లి, గోల్కొండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రీ స్కూళ్లలో కొంతమంది నిర్వాహకులు అడ్మిషన్ ఫీజుగా రూ.40 వేల నుంచి 25 వేల వరకు తీసుకుంటున్నట్లు తెలిసింది. అలాగే నెలవారీ ఫీజు కింద రూ.1500-2000 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

# నేడు నాంపల్లిలో చేప ప్రసాదం

**44 గంటలపాటు సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు**

**హైదరాబాద్ జూన్ 7 ప్రభాతవార్త :** మృగశిర కార్తెలో చేప ప్రసాదం పంపిణీకి రంగం సిద్ధమైంది. బత్తిని సోదరుల ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగర ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు ఈ ప్రసాదం కోసం తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ముందస్తుగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. చేపప్రసాదం పంపిణి కారణంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం రాత్రి 8 గంటల వరకు నాంపల్లి, ఆ పరిసర రనపాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు పూర్తిగా అమల్లో ఉంటాయి. దీంతో సాధారణ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు.

నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు గృహకల్ప, గగన్ విహార్, చంద్ర విహార్ ప్రాంతాల్లో పార్క్ చేయాలని, ఎంజే మార్కెట్ వైపు నుంచి వచ్చే బస్సులు, వ్యాన్లలోని ప్రయాణికులకు గాంధీ భవన్ బస్ స్టాప్ వద్దకు అనుమతి.. నాంపల్లి వైపు నుంచి వచ్చే వారు గృహకల్ప బస్ స్టాప్ వద్దకు అనుమతించనున్నట్లు తెలిపారు. వీఐపీ కార్ పాస్ హోల్డర్ల కోసం ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ద్విచక్ర వాహనదారుల కోసం మనోరంజన్ కాంప్లెక్స్, భీమ్రావ్ బాడా ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేశారు. ఆటోలలో వచ్చే భక్తులు షెజాన్ హోటల్ ఎదురుగా ఏర్పాటు చేశారు.



**పార్కింగ్ స్థలాలు ఇవే...**

కారు, భారీ ఫోర్ వాహనాలను గృహకల్ప, గగన్‌విహార్, చంద్రవిహార్ సమీపంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. బస్సులు, వ్యాన్లలో వచ్చే వారు గాంధీభవన్, గృహకల్ప బస్‌స్టాప్‌ల వద్ద దిగి, అక్కడి నుంచి కాలినడకన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకోవాలి.



## సందడిగా సైకిల్ ర్యాలీ

**గచ్చిబౌలి, జూన్ 7 ప్రభాతవార్త:** వరల్డ్ సైక్లింగ్ డేను పురస్కరించుకొని ఆదివారం ఫిట్ ఇండియా ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో నిర్వహించిన సండేస్ ఆన్ సైక్లింగ్ ఉత్సాహంగా సాగింది. తెలంగాణ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన ఈ ర్యాలీకి నగరంలోని ఔత్సాహికులు భారీఎత్తున హాజరయ్యారు. ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా ముఖ్య అతిథిగా హాజరై సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బ్యాగులో పెట్టిన బంగారు ఆభరణాలు మాయం

**జూబ్లీహిల్స్, జూన్ 7, ప్రభాతవార్త :** రైలులో, క్యాబ్‌లో ప్రయాణించి ఇంటికి చేరిన ఒక మహిళ బ్యాగులోని 152 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమైన సంఘటన పంజాగుట్ట ఠాణాలో చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సోమాజీగూడ ప్రాంతానికి చెందిన శ్రద్ధా షింగ్నే ఇద్దరు పిల్లలతో కలిసి జూన్ 2న మధ్యప్రదేశ్‌లోని బేతూల్ రైల్వేస్టేషన్‌లో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి హైదరాబాద్‌కు బయలు దేరారు. వీరితోపాటు ఆమె తల్లి మాలతి వాంఖెడే, మరదలు సోనాలి వాంఖెడే ప్రయాణించారు. ప్రయాణ సమయంలో సామాన్లన్నింటినీ దిగువ బెర్త్ కింద భద్రంగా పెట్టారు. నగదు, మందులు, మొబైల్ ఫోన్ తోపాటు బంగారు ఆభరణాలు ఉన్న చిన్న నగల పెట్టెను బ్యాక్‌ప్యాక్‌లో జాగ్రత్తగా పెట్టారు. జూన్ 3 ఉదయం 5 గంటలకు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత బ్యాగుల జిప్పులు, ఇతర వస్తువులు యథా విధిగా ఉన్నాయని గుర్తించారు. క్యాబ్ బుక్ చేసుకొని ఇంటికి చేరుకుని విశ్రాంతి తీసుకున్న తర్వాత నగల పెట్టెను పరిశీలించగా అది కనిపించ లేదు. మొత్తం 152 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు.

## పీపుల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నాగేశ్వర్

**కంటోన్మెంట్, జూన్ 7 ప్రభాతవార్త:** మల్కాజిగిరి సఫిల్‌గూడ ప్రాంతానికి చెందిన డాక్టర్ నాగేశ్వర్‌రావ్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా నేషనల్ భారత్ సేవక్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినట్లు నేషనల్ చైర్మన్ డాక్టర్ ఎస్.మణి మేజియన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ దళిత సామాజికవర్గానికి చెందిన తాను మల్కాజిగిరి, కంటోన్మెంట్ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు.

# ఊరంతా ఏకమై..



**కొత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త:** సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ఉధృతంగా మారుతోంది. డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రజలు, బిఆర్ఎస్ నేతలు కలిసి భారీ ఎత్తున వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇల్లాలు, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల నుండి బియ్యాన్ని తీసుకువచ్చి, డంపింగ్ యార్డ్ కోసం కేటాయించిన స్థలంలోనే వంటలు వండి, అక్కడే అందరూ కలిసి భోజనాలు చేశారు. తమ ప్రాణాలను పణంగా పెట్టయినా సరే ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకొని తీరుతామని ప్రభుత్వానికి వారు గట్టి హెచ్చరిక జారీ చేశారు. మనకు పార్టీలు కాదు.. ప్రజల ప్రాణాలు ముఖ్యం అని ఈ సందర్భంగా ఇతర పార్టీల నేతలకు సైతం వారు సూచించారు.

**ఐటీ పార్క్ ఆశలపై డంపింగ్ నీళ్లు**

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పోరాట కమిటీ అధ్యక్షులు ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ ఐటీ పార్క్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఉద్దేశంతో అసైన్డ్ భూములను టిజిఐఐసికి అప్పగించిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆ స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి ప్రజల జీవితాలను అంధకారంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఐటీ పరిశ్రమలు వస్తే తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన స్థానిక యువత, ఇప్పుడు డంపింగ్ యార్డ్ ప్రకటనతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కనీసం స్థానిక ప్రజల అభిప్రాయాలను, ప్రజాభిప్రాయ సేకరణను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డ్‌ను ఎలా ఏర్పాటు చేస్తారని సత్యనారాయణ ప్రశ్నించారు. నలుగురితో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం ఎలాగైతే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిందో, అదే స్ఫూర్తితో డంపింగ్ యార్డ్‌ను ఇక్కడి నుంచి పంపించే వరకు తమ పోరాటం ఆగేదే లేదని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా యువత, ప్రజలు ఈ ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకులే ప్రజా ఉద్యమాలు చేపట్టినా, తాము పార్టీలకతీతంగా వారికి మద్దతు ఇచ్చి కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

అణచివేయాలని చూస్తే ఆగేది లేదు

ప్రస్తుతం చుట్టుపక్కల ఉన్న దాదాపు 30 గ్రామాల ప్రజలు బిఆర్ఎస్ పార్టీతో కలిసి ఉద్యమించడానికి సిద్ధమవుతుంటే, అధికార పార్టీ నాయకులు మాత్రం యువతను, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ చేస్తున్న ఈ న్యాయమైన పోరాటాలను ప్రభుత్వం పోలీసుల చేత అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు. డంపింగ్ యార్డ్ వద్దు అనుకునే వారు ఎవరైనా తమతో కలిసి రావచ్చని, లేదా ప్రజల కోసం ఎవరు ఉద్యమించినా తాము కలిసి నడుస్తామని పునరుద్ఘాటించారు. ఈ భారీ వంటావార్పు కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సలహాదారు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, కన్వీనర్లు బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్యలతో పాటు స్థానిక నాయకులు కడల శ్రీశైలం, నరేందర్ రెడ్డి, బాబు రాజు నాయక్, రెడ్యానాయక్, వడ్డే మల్లేష్, రాజు నాయక్, నాను నాయక్, జాంప్ల, చందర్ నాయక్, వడ్డే మహేష్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

**సిద్దాపూర్ గ్రామ వీధులన్నీ ఆదివారం ఉదయమే ఏకతాటిపైకి వచ్చాయి. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో భాగంగా.. గ్రామంలోని ప్రతి ఒక్క ఇల్లూ కదిలింది. ఊరిలోని ప్రతి ఇంటి నుండి గుప్పెడు బియ్యాన్ని సేకరించి, నేరుగా డంపింగ్ యార్డ్ కోసం ప్రతిపాదించిన ఆ స్థలానికే చేరుకున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై నిరసనగా.. డంపింగ్ యార్డ్ స్థలంలోనే పొయ్యిలు వెలిగించి, వంటావార్పు నిర్వహించి, ఊరంతా అక్కడే కలిసి భోజనాలు చేశారు. తమ ప్రాణాలను పణంగా పెట్టైనా సరే ఈ డంపింగ్ యార్డ్‌ను అడ్డుకొని తీరుతామని, ఇక్కడ ప్రజాజీవితాలను అంధకారం కానివ్వబోమని ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు**

**★సిద్దాపూర్‌లో కాలుష్యకారకాలపై యుద్ధం ★ప్రతి ఇంటి నుంచి బియ్యం తెచ్చి యార్డ్ కోసం ప్రతిపాదిత స్థలంలో వంటావార్పు ★అక్కడే సామూహిక భోజనాలు చేసి వినూత్న నిరసన ★ప్రాణాలైనా ఇస్తాం కానీ, డంపింగ్ యార్డ్‌ను రానివ్వబోమని హెచ్చరిక**



వంటావార్పుతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

# కిట్టు గురుస్వామి ఆధ్వర్యంలో రుద్ర సహిత చండీ హోమం

..హైందవ బంధువులు అందరూ ప్రతి ఒక్కరు పాల్గొనాలి..

**రంగారెడ్డి అర్బన్ జూన్ 7,ప్రభాతవార్త :** అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మరియు బాల శ్రీ శాస్త శ్రీ పీఠం సంయుక్తంగా శ్రీ రుద్ర సహిత చండీ హోమం శ్రీ శ్రీ కిట్టు గురుస్వామి ఆధ్వర్యంలో 25 నుంచి 29 వరకు నిర్వహించనున్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్నటువంటి చర్యలు కావచ్చు లేదా వాతావరణం లో వచ్చే మార్పులు కావచ్చు హైందవ సంస్కృతిలో మనకు ఋషులు లేక పెద్దలు కావచ్చు హోమాలు యాగాలకు అత్యున్నత స్థానం కల్పించారు ఈ హోమాధులను దృష్టిలో పెట్టుకొని సామాన్య ప్రజలకు దరిద్రం దూరం అయి మరియు ఆరోగ్యం కోసం కావచ్చు శుభ ఫలితాలను అందజేయడం కోసం బాలశాస్త్ర శ్రీ పీఠం ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సంధి హోమం సహిత చండీ హోమం ప్రముఖ చారిత్రాత్మక అమ్మపల్లి నర్ కూడా దేవాలయం ఎదురుగా ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం ఎదుట ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు ఈ పూజా కార్యక్రమంలో భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని చండీ దేవుని కృపకు పరమశివుని ఆశీస్సులకు పాత్రులు కాగలరని కోరుతున్నారు ఈ పూజా కార్యక్రమంలో లక్ష్మీ ౖ గణపతి హోమం అయ్యప్ప హోమం సుబ్రహ్మణ్యస్వామి హోమం నవగ్రహ భద్రకాళి హోమాలు జరగనున్నట్లు ఆయన వెల్లడించారు అఖిలభారత అయ్యప్ప దీక్షా సమితి పర్యవేక్షణలో శాస్త్రవేత్తంగా వేద పండితులు ద్వారా నిర్వహించబడుతుంది అను సూచించారు అన్ని రకాలు గాఅమ్మ వారి ఆశీర్వాదాలు ఉంటాయన్నారు. ఎక్కడైతే అమ్మవారి చండీయాగం జరుగుతుందో అక్కడ అమ్మవారు నెలకొని ఉంటారన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**పూడూరు, జూన్ 7, ప్రభాతవార్త :** అనుమానాస్పద స్థితిలో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం గొంగుపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది.చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం చౌడాపూర్ మండలం గోగ్యానాయక్ తాండకు చెందిన నేనావత్ మంగ్యా (43) అనేవ్యక్తి శనివారం ఉదయం 10గంటలకు పనినిమిత్తం పరిగికి వెళ్లివస్తానని ఇంట్లోచెప్పి బయలుదేరాడు.మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పూడూరు మండలం పరిధిలోని గొంగుపల్లి సీతమ్మ దేవాలయం సమీపంలో నేనావత్ మంగ్యా మృతిచెంది ఉన్నట్లు అడవి వెంకటాపూర్ తాండాకు చెందిన కాట్రావత్ విజయమ్మ మృతుడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న మృతుడి కుటుంబీకులు మృతదేహంపై గాయాలు ఉండడంతో నేనావత్ మంగ్యా (43) మృతికి చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్ తాండాకు చెందిన కాట్రావత్ విజయమ్మ,ఆమెభర్త గంగ్యా,కుమారుడు రవిపై అనుమానంవ్యక్తం చేస్తూ మృతుడి కుమారుడు నేనావత్ శ్రీనివాస్ చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయగా కేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సామూహిక భాగస్వామ్యం కోసమే హ్యాపీ సండే




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, పాల్గొన్న కమిషనర్ వెంకట్‌రెడ్డి దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 7, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా హ్యాపీ సండే కార్యక్రమాన్ని జరుపుకోవటంతో ప్రజల ఆరోగ్యం, సామాజిక చైతన్యం, ప్రజల భాగస్వామ్యంకు దోహద పడుతుందని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీష కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలో హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగ వ్యాయామ, సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, సాంస్కృతిక వికాసం, సామాజిక అవగాహన పెంపొందించటమే ప్రధాన లక్ష్యంగా మున్సిపల్‌లో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. దీనిలో యోగాబ్యాసం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన విధానం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతను తెలియజేస్తుందన్నారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలో పలు చోట్ల హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, భారతీయ యోగ సంస్థ జనరల్ సెక్రటరీ, యోగ గురువు రాజేందర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, మహిళా సంఘాల వారు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉత్సాహంగ పాల్గొన్నారు.

# మాకే నాం-పేడ్‌లో బిజెపి నేతలు

**శామీర్‌పేట, జూన్ 7, ప్రభాతవార్త :** అలియాబాద్ మున్సిపల్ పరిధిలో బిజెపి మాకే నాం-పేడ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్ కె.గణేశ్, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణ ముదిరాజ్‌లు మొక్కలు నాటారు. ఆదివారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్‌లో బిజెపి మున్సిపల్ అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో బిజెపి మాకే నాం-పేడ్ కార్యక్రమంలో భాగంగ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఉపాధ్యక్షులు గౌరారం రమేశ్, ఎస్టీమోర్చ అధ్యక్షులు భీమానాయక్, సత్యనారాయణ, మల్యాల మహేశ్, ప్రధాన కార్యదర్శి పాక నాగరాజు, బూత్ అధ్యక్షులు బాబు ముదిరాజ్, తేజకాంత్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్ కె.గణేశ్, బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్, తదితరుల దృశ్యం

# ప్రధాని యోజన బాండ్లు పంపిణీ

**శామీర్‌పేట, జూన్ 7, ప్రభాతవార్త:**

ప్రధాన మంత్రి సురక్ష-భీమా యోజన పథకం (ఇన్సురెన్సు) బాండ్లను ప్రజలకు మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, బిజెపి రాష్ట్ర నాయకురాల ఎన్.హైమారెడ్డి పంపిణీ చేశారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని బాబగూడ గ్రామంలో ప్రధాన మంత్రి సురక్ష-భీమా యోజన పథకం బాండ్లను ఆమె అందజేశారు. అయితే మీ సమస్యా-మా పరిష్కారం కార్యక్రమంలో పలువురికి ఉచితంగా ప్రధాన మంత్రి సురక్ష-భీమా యోజన పథకం (ఇన్సురెన్స్) హైమారెడ్డి చేయించారు. ఆమె ఉచితంగా చేయించిన భీమా యోజన పథకం బాండ్లను అందజేయటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ట్రెజరర్ అంబటి రమేశ్, ఆంజనేయులు ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు సురేందర్‌రెడ్డి, ఇంద్రకశేఖర్‌రెడ్డి, బిజెపి నాయకులు, పలువురు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

**కుల్కచర్ల, జూన్ 7 ప్రభాతవార్త:** డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని ఎస్ఐ రమేష్ కుమార్ అన్నారు.అదివారం మండల కేంద్రంలోని వి.ఎస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలోనిలోని కంప్యూటర్‌శిక్షణ పూర్తి చేసుకున్నా విద్యార్థులకు కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్, టిడబ్లుజేయు ఐజేయు రాష్ట్ర కమిటి మెంబర్ శివకుమార్ చెతుల మిదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అంజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ కుమార్‌మాట్లాడుతూ..ప్రస్తుత పోటి ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమన్నారు. కంప్యూటర్ నైపుణ్యాలు ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు వ్యక్తిగత అభిశద్ధికి కూడా దోహద పడుతాయని అన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులను అభినందంచారు.అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కెపిఎం ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి,జర్నలిస్టు వినోద్ కుమార్,ని వి.ఎస్ కంప్యూటర్ శిక్షణ కేంద్ర న్విహకులు భరత్ కుమార్ గౌడ్,ఉత్తమ్ కుమార్ గౌడ్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వి.ఎస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో సర్టిఫికెట్లు అంజేస్తున్న ఎస్ఐ

# రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:** రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం 9:55 గంటల కంటటే ముందు చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలలో మురుగుకాలువ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని సికింద్రాబాద్ డివై ఎస్ఎస్ నుంచి సమాచారం రావడంతో జిఆర్‌పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడు 35 నుంచి 40 సంవత్సరాలు కల్గి ఉంటాడని, గులాబి రంగు టీషర్ట్, నీలిరంగు ట్రాక్ ప్యాంట్ దరించి ఉన్నాడని, ఎడమవైపు మెడపైన పుట్టుమచ్చ ఉందని తెలిపారు. రైలుపట్టాలపై నడుచుకుంటు వెళ్తుండగా రైలు ఢీకొని ఉండవచ్చని, రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మురుగు కాలువలోకి జారి తీవ్ర గాయాలై మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుని వివ రాలు తెలిసిన వారు రైల్వే పోలీస్ సెల్ నెం: 9440083160, 8712658581లకు సంప్రదించాలని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

# రక్తదానం జీవన వరం-కార్మిక సంక్షేమమే బలం

-ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు: ఈటల

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:** రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితులలో ఉన్న రోగులను కాపాడవచ్చని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని కార్మికులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి, వైఎస్ రెడ్డి ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన ఇంటి ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేయగా పలువురు యువకులు, బిజెపి నాయకులు వచ్చి రక్తాన్ని ఇచ్చారు. కార్మికుల కోసం లేబర్ కార్డులను చేయగా ఎంపీ రాజేందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. లేబర్ కార్డులు ప్రతి కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భీమా పథకాలు, భీమా సౌకర్యాలు, విద్యా, వైద్య ప్రయోజనాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి అర్హత కల్గిన కార్మికుడు లేబర్ కార్డులు పొందాలని వారి హక్కులను కాపాడేందుకు బిజెపి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు. రక్తదానం మహదానం అని మనం ఇచ్చే రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడుతుందని, జన్మదినాల సందర్భంగా ఇలాంటి సేవవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే సేవాకార్యక్రమాల రూపంలో నిర్వహించడం అభినందనీయమని ఎంపీ తెలిపారు. ఈసందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి సుదర్శన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు-కామారెడ్డి ఇంచార్జ్ పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అమరం మోహన్‌రెడ్డి, గొనె శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గొంగళ్ల బాలేష్, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు కప్పరగళ్ల కరుణాకర్, జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఏనుగు లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షులు, పతాధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బొడ్రాయి బోనాల ఉత్సవాలు

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో బొడ్రాయి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బొడ్రాయి ప్రతిష్టించి రెండేళ్లుగా కావడంతో ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించారు. శనివారం ఉదయం బొడ్రాయికి పంచామృత అభిషేకం, పవిత్ర నీటితో అభిషేకం, బోనాలు చేసి బొడ్రాయి సమర్పించారు. ఆదివారం మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌లతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి బొడ్రాయి పూజలో పాల్గొని గ్రామదేవతలను దర్శించుకొని పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వహకులు శాలువాలతో వారిని సన్మానించారు. అవుషాపూర్‌లో నాయకులు పెద్దసంఖ్యలో బొడ్రాయి పండుగ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామ దేవతల ఆలయాలను వివిధ రకాల పూలు, వేపాకులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. పసుపు, కుంకుమ, వేపాకులతో బోనాలను



అవుషాపూర్‌లో బొడ్రాయి పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

తయారు చేసి డప్పుశబ్దాల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బండారి శ్రీనివాస గౌడ్, మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ దొంకెన బిక్షపతిగౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు ఏనుగు కావేరి మచ్చేందర్‌రెడ్డి, కందకట్ల విజయలక్ష్మారెడ్డి, వరిగంటి వెంకటేశ్‌గౌడ్, వంగూరి శివశంకర్, మాజీ ఎంపిటిసి ఏనుగు లక్ష్మారెడ్డి, కొట్టి గోపాల్‌రెడ్డి, నాగులపల్లి రమేశ, మంకం రవి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులుఉ మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ ఉపసర్పంచులు ఎలసాని అయిలయ్యయాదవ్, బొడ్డు నాగార్జున్, గడ్డిఅన్నారం మార్కెట్ మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండారి అంజనేయులుగౌడ్, ఆర్‌బిఎస్ జిల్లా మాజీ సభ్యులు చిలుగూరి మంకయ్య, డిసిసి మాజీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ వార్డుసభ్యులు దొంకెన శంకర్‌గౌడ్, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య, ఎరుకల దుర్గరాజు, వీరేశం, మల్లేశ్, వర్త్య పవన్‌నాయక్, నాయకులు బద్దం జగన్మోహన్‌రెడ్డి, పన్నాల ప్రతాపరెడ్డి, కానుగంటి శ్రీనివాస్, కవాడి మాధవరెడ్డి, కుక్కునూరి రాజేశేఖర్, కవాడి వామన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అబ్బోళ్ల నాగేశ్, పులకంటి రాజశేఖర్‌రెడ్డి, కందకట్ల సందీప్‌రెడ్డి, కుర్ర వేగానంద్‌గౌడ్, అల్లం శంకర్, దొంకెన మధు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల్లో బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్

**-న్యాయం కోసం అగచాట్లు పడుతున్న అమాయకులు**

**-సమస్య నివారణకు హైకోర్టు న్యాయవాది అనిల్ దొరశెట్టి సూచన**

**న్యాల్‌కల్, ప్రభాతవార్త, జూన్ 7, ప్రభాతవార్త:** డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ సేవలు ప్రజా జీవితాల్లో అంతర్భాగమయ్యాయి. యూపిఐ చెల్లింపులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్లు రోజువారి ఆర్థిక లావా దేవీలను సులభతరం చేశాయని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆర్థిక లావాదేవీల సౌలభ్యం వెనుక ఆందోళనకర వాస్తవం ఒకటి దాగి ఉంది. సైబర్ మోసాలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుం టోంది. ఇందులో భాగంగా అనుమానాస్పద లావా దేవీలకు సంబంధించి ఉన్న బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడం సాధారణ ప్రక్రియగా మారింది. బాధితుల డబ్బును రక్షించడం, నేరస్థులను గుర్తించడం ఎంత అవ సరమో అదే స్థాయిలో అమాయక పౌరుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాల కారణంగా అనేక మంది నిర్ధో షులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సైబర్ క్రైమ్ నిపుణులు, హైకోర్టు న్యాయవాది దొరశెట్టి అనిల్‌కుమార్ అభిప్రాయ పడ్డారు. ఆదివారం ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండల కేంద్రమైన న్యాల్‌కల్‌కు వచ్చిన సందర్భంగా ప్రభాతవార్తతో అనిల్‌కుమార్ దొరశెట్టి మాట్లాడుతూ...

**-తప్పు మోసగాడిది-శిక్ష అమాయకుడికి?**

ఓ సబైర్ మోసగాడు బాధితుడి నుంచి లక్ష రూపా యలు మోసం చేసి ఆ డబ్బుతో ఓ వ్యాపారుడి వద్ద సరు కులు కొనుగోలు చేస్తే వ్యాపారుడికి సైబర్ నేరంతో సంబంధం లేకపోయినా సైబర్ నేరానికి గురైన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే మోసపూరిత డబ్బు వ్యాపా రుడి బ్యాంక్ ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించి సదరు వ్యాపారి బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయడంతో అమాయ కుడైన వ్యాపారి అవస్థలు పాలుకాక తప్పడం లేదన్నారు.

**-ఫ్రీజింగ్‌తో ఆర్థిక జీవితం స్థంభనం...**

వ్యాపారి బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయడంతో ఉద్యో గులకు జీతాలు చెల్లించుకోలేకపోవడం, సరఫరా దారులకు బకాయిలు చెల్లించుకునే అవకాశం లేకపోవడం, కుటుంబ అవసరాలను తీర్చుకునే అవకాశాలు లేక ఓ వైపు అవస్థలు పడుతుంటే మరో వైపు బ్యాంక్ ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయించుకునేందుకు సంబంధిత రాష్ట్రాలలోని సైబర్ పోలీసులను సంప్రదించి న్యాయవాదులను నియ మించుకోవాల్సి వస్తుంది. కార్యాలయాల చుట్టూ చెప్పుల రిగేలా తిరిగాడుతూ తమ తప్పు లేకపోయినా వివాదా స్పద మొత్తాన్ని తిరిగి చెల్లించడం ద్వారా ఉపశమనం పొందాల్సి వస్తోంది.

**-ఒకే లావాదేవి-అనేక ఫిర్యాదులు...**

ఒకే బ్యాంక్ లావాదేవీకి సంబంధించి భారత దేశం లోని వేర్వేరు రాష్ట్రాల్లో అనేక సైబర్ ఫిర్యాదులు నమో దయితే లావాదేవీ తేదీ, బదిలీ అయిన నగదు, వివాదాస్పద మొత్తం, యుటిఆర్ నంబర్ సైతం ఒకటే అయినా ప్రతి ఫిర్యాదును వేర్వేరుసుంగా పరిగణిస్తూ ఒక ఫిర్యాదులో మొత్తం తిరిగి చెల్లించి ఎన్ఓసి పొందినా, మిగిలిన రాష్ట్రాల్లోని పోలీసు అధికారులను మరో మారు సంప్రదిస్తూ ఆడిందే ఆటగా పాడిందే పాటగా మళ్లీ మళ్లీ ఎదుర్కోవాల్సి రావడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని న్యాయపుస్తకాలు బోధిస్తున్నాయి.


**-ఒకే సమస్యకు ఒకే పరిష్కారం ఉండాలి...**

సైబర్ నేరాలకు రాష్ట్ర సరిహద్దులు ఉండనట్లుగా పరిష్కార వ్యవస్థ సైతం జాతీయ స్థాయిలో ఉండాల్సిన అవసరం ఉంది. ఒకే లావాదేవీకి సంబంధించిన అన్ని ఫిర్యాదులను అనుసంధానం చేస్తూ కేంద్ర వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఒకసారి డబ్బు తిరిగి చెల్లిస్తే, వివాదం పరిష్కారమైతే సదరు సమాచారం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని సంబంధిత అధికారులకు అందుబాటులోకి వస్తే అమాయక ఖాతాదారులు ఒకే విషయానికి పలుమార్లు వివరణలు ఇచ్చుకోవాల్సి అవసరం ఉండదు.

**-ఎన్‌సిసిఆర్‌పి పోర్టల్‌లో పారదర్శకత అవసరం...**

ఎన్‌సిసిఆర్‌పి పోర్టల్‌లో పారదర్శకత అవసరం. ఖాతా అన్‌ఫ్రీజ్ అయినా డబ్బు తిరిగి చెల్లించినా ఎన్ఓసి జారీ అయినా ఫిర్యాదు వివరాలు చాలా మేరకు యధా తథంగా కనిపిస్తున్నాయి. ట్రాఫిక్ చలాన్ల వ్యవస్థలో జరిమానా చెల్లించిన వెంటనే పెయిడ్ అయినట్లు కనిపించి నట్లే సైబర్ ఫిర్యాదుల విషయంలోనూ రిసాల్వ్‌డ్, క్లోస్డ్, నో ఫర్‌దర్ ఆక్షన్ పెండింగ్ లాంటి స్పష్టమైన స్థితి కానరావాల్సిన అవసరం ఉంది. ఒకే లావాదేవీపై బహుళ బాధ్యతలను నివారించాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైమ్ నిపుణులు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది దొరశెట్టి అనిల్‌కుమార్ సూచిస్తున్నారు. అమాయకులకు న్యాయం చేకూరేందుకు ఖాతాల అన్‌ఫ్రీజింగ్ ప్రక్రీయను వేగవంతం చేయాలని అనిల్‌కుమార్ సూచించారు. ఎన్‌సిసిఆర్‌పి రికార్డులను సమయానుకూలంగా నవీ కరించాలన్నారు. అమాయక ఖాతాదారులకు సమర్థవంతమైన పరిహార వ్యవస్థ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఏకరీతి విధానాన్ని అమలు చేయాలన్నారు. సైబర్ నేరాలపై కఠినంగా వ్యవహ రించాల్సిన అవసరం ఉందని, న్యాయబద్ధంగా, పార దర్శకంగా, సమతుల్యంగా కూడా ఉండాలని, అమా యకులకు అన్యాయం జరుగకుండా అవసరం ప్రభుత్వంపై ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

# భక్తులతో కిటకిటలాడిన మల్లన్న దేవాలయం



స్వామి వారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

**కొమురవెల్లి, జూన్ 7,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన భక్తులతో మల్లన్న ఆలయ పరిసరాలు కిటకిటలడాయి. ఆలయ మాడ వీధులు,క్యూలైన్‌లు,ప్రసాద కౌంటర్ సెంటర్లు అర్థ మండపం గంగ రేణు చెట్టు,మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. స్వామి వారి దర్శనానికి నాలుగు గంటలు,ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. వేసవి సెలవుల ముగిస్తుండడంతో ఆలయానికి రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కు లు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ తగు ఏర్పాట్లు చేశారు.

## కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డిఆర్ఎం

**కొమురవెల్లి, జూన్ 7,ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే హైదారాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్(డిఆర్ఎం) సంతోష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. స్టేషన్‌లో ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలు,మౌలిక వసతులు,అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్ర పటం అందజేశారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై డిఆర్ఎం అధికారులతో చర్చించారు.




స్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం

# 14న లంద నవల ఆవిష్కరణ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత పొన్నాల బాలయ్య రచించిన 'లంద' నవల ఆవిష్కరణ ఈనెల 14న హైదారాబాద్‌లోని రవీంద్రభారతి మినీ హాల్‌లో ఆవిష్కరించడం జరుగుతుందని మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కె.రంగాచార్య, టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, నవల రచయిత పొన్నాల బాలయ్య, మరసం ఉపాధ్యక్షులు అలాజ్‌పూర్ శ్రీనివాస్, నందిని భగవాన్‌రెడ్డి, కవి, రచయిత రాజిరెడ్డిలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు.

కార్యక్రమానికి ప్రఖ్యాత కవి,రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిద్దారెడ్డి. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవి, రచయిత ప్రొ॥ కాశీం తదితరులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో మాదిగ సామాజిక వర్గాల జీవితం ప్రధాన అంశంగా పొన్నాల బాలయ్య 'లంద' నవల రచించారని తెలిపారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో లంద నవల తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుందన్నారు. నవల ఆవిష్కరణ సభకు జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గంభీర్రావుపేట యాదిగిరి, మాదిగ దండోరా ప్రతినిధులు పెద్దమాతరి బాబు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సుభిక్షానికి మాయికోడ్‌లో యజ్ఞహోమాలు

**మనూర్, జూన్ 7, ప్రభాతవార్త:** గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ మండలంలోని మాయికోడ్ గ్రామస్థులు ఆదివారం యజ్ఞహోమాలు నిర్వహించారు. ప్రతి మాసం మొదటి ఆదివారం గ్రామానికి చెందిన పుణ్యదంపతులు వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో యజ్ఞహోమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామానికి చెందిన కొత్త నాందేవ్‌రావు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి బాధ్యులు, గ్రామస్థులు పాల్గొ న్నారు.

## సైక్లింగ్‌తో ఆరోగ్యంతోపాటు శారీరక దృఢత్వం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** వరల్డ్ సైకిల్‌డే పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జిల్లా క్రీడా యువజన శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డివైఎస్ఓ వీరారెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, కేలో ఇండియా సైక్లింగ్ కోచ్ సంజీవ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా డివైఎస్ఓ వీరా రెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సూచన మేరకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. సైక్లింగ్‌తో ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం చేకూరుతుందన్నారు. పర్యావరణ రహిత సైక్లింగ్ సాధన ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. విద్యార్థులు సైతం సైక్లింగ్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కేలో ఇండియా సైక్లిస్టులు 50 మంది పాల్గొన్నారు.

